
# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH



**August 1994**

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు M.O. చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | పెద్ద బైబిలు | రూ. 45-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**

**Sambamurthi St., Ramaraopeta,**

**KAKINADA - 533 004.**

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 ఆగష్టు 1994 సంచిక 1


# సంపాదకీయము

## సంఘము నిమిత్తమై ప్రభువుకు కృతజ్ఞతలు

**( Thank the Lord for the Church )**

ప్రభువు స్థాపించిన ఏకైక సంఘము నిమిత్తమై ఆయనకు వందనములు. బైబిలులో కనుగొనగలిగింది అది ఒక్క సంఘము మాత్రమే. దేవుని అనుమతి బడసి ఆయన ఆశీస్సులతో ఈ లోకంలో కొనసాగుచున్నది అది ఒక్కటి మాత్రమే. ఈ లోకంలో అనేక సంఘములున్న మాట నిజమే. అంటే ప్రభువు వాటిని ఎరుగక పోయినను, మానవులచే స్థాపించబడిన అనేక అసత్య సంఘాలున్నవని తెలియనగును. బైబిలులో కనబడని సంఘములో నీవు సభ్యత్వము పొందియుంటే, దానిని విడిచి దేవుని సత్యవాక్యాన్ని తెలిసికొని, సువార్తకు విధేయుడవైతే ప్రభువే నిన్ను తన సంఘమందు చేర్చుకొంటారు. అపొ.కా. 2వ అధ్యాయాన్ని దయచేసి చదువండి.

సంఘము రక్షకుడు కాదు గాని రక్షింపబడిన వారందరు సంఘములో యుంటారన్న సంగతి స్పష్టమే (అపొ.కా. 2:47). క్రీస్తు ఒక్కడే రక్షకుడు. ఆయన మాత్రమే మనలను రక్షిస్తాడు (తీతు 2 : 13). అయితే క్రీస్తు సంఘాన్ని స్థాపించాడు (మత్త 16:18), దాని కొరకు ప్రాణాలర్పించాడు (ఎఫె 5:25), దాన్ని ఆయన తన స్వరక్తమిచ్చి కొన్నాడు (అపొ.కా. 20 : 28), ఆయనే శరీరమునకు రక్షకుడని, ఆ శరీరమే సంఘమని మనకు చెప్పబడినది (ఎఫెసీ 5 : 23), మరల "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియై యుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (కొలస్స 1:18). అంతే కాకుండ శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే, ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, నిరీక్షణ ఒక్కటే, తండ్రియైన దేవుడు ఒక్కడే యని కూడ చెప్పబడింది (ఎఫెసీ 4:4-6).

ఒకేఒక్క శరీరమున్నట్లు, ఆ శరీరము సంఘమయితే, ఉన్న సంఘము ఒక్కటే యని అర్థము. ప్రభువు ఒకని రక్షించినప్పుడు, అతనిని ఆయన తన సంఘమందు చేర్చుకొంటాడు. అంటే రక్షింపబడిన వారందరు ఆయన సంఘమవుతారు. ఆయన సంఘ సభ్యులందరు దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి కలిగి యుండాలి. సంఘము కళంకమైనను, ముడతయైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను యుంటే దానిని మహిమగల సంఘముగా ఆయన తన యెదుట నిలువబెట్టుకొంటాడు (ఎఫెసీ 5:27). అంత్యదినమందు ప్రభువు తన దూతలను పంపును. వారాయన రాజ్యములో నుండి ఆటంకములను సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు (మత్త 13:41). ఆయన రాజ్యమే ఆయన సంఘము (మత్త 16 : 18, 19). గనుక రక్షింపబడాలంటే

ఒకడు. ప్రభువునకు లోబడి ఆయన సంఘములో చేర్చబడి మరణ పర్యంతము నమ్మకముగా యుండాలి (ప్రక 2:10). నీవు క్రీస్తు సంఘ సభ్యుడవై నీ యిష్టమొచ్చిన రీతిగా జీవించి, పరలోకం చేరుకోగలనని అనుకోవద్దు.

ప్రభువు సంఘ సభ్యులమై యున్నందుకు మనం ఆయనకు ఎంతో కృతజ్ఞులమై యుండాలి. సంఘ సభ్యులుగా మనకు అన్ని ఆశీర్వాదములు, హక్కులు ఉన్నాయి. మనం దేవుని పిల్లలం. యేసు క్రీస్తు ద్వారా దేవునికి ప్రార్థించే హక్కు కలిగి యున్నాము (గలతీ 3:26, 27; 1యోహాను 5:14). ఆయన మనతో ఎల్లప్పుడు ఉంటానని చేసిన వాగ్దాన మున్నది (మత్త 28:19, 20). క్రీస్తునందు సమస్త ఆత్మీయాశీర్వాదము లున్నాయి (గలతీ 1:3). మరియు నిత్యజీవ నిరీక్షణ కలిగియున్నాము (యోహాను 14:1-3).

అంతేకాదు సంఘ సభ్యులుగా మనకు స్థానికంగా, ప్రపంచ మందంతటా కూడ సోదర సోదరీ లుందురు. ఈ లోకంలో యున్న ఘనులతో కలసి మనం ఆరాధింతుము. ఒకరితో ఒకరు సహవాసము చేయవచ్చు, ఒకరికొకరు సహాయము చేయవచ్చును, హెచ్చరించు కొనవచ్చును, కలసి దేవునికొరకు పని చేయవచ్చును. మన క్రైస్తవ జీవనముయొక్క ప్రభావమును బట్టి మనతో కలసి ఉద్యోగము చేయువారు కూడ క్రీస్తులోనికి ఆకర్షింపబడుదురు. మన బిడ్డలు సత్ క్రైస్తవ కుటుంబములలోనికి వివాహమున కీయబడుదురు. సంఘములో యున్నందున ఇట్టి ఆశీర్వాదములెన్నో యున్నవి. మనము వాటిని గమనిస్తు ప్రభువుకు కృతజ్ఞత చెల్లింప బాధ్యులమై యున్నాము.

అంతేకాదు, సంఘానికి ఈ లోకానికి యున్న సంబంధము ఆలోచిస్తే, క్రైస్తవుడు ఈ లోకమునకు వెలుగై యున్నాడని చెప్ప

బడినది (మత్త 5:14, 15). అట్లయినప్పుడు లోకంలోయున్న క్రైస్తవులందరు అంధకారాన్ని పారద్రోలే జ్యోతులై యున్నారు (1 యోహాను 1:5-7). అయితే ఆ జ్యోతులు లేకపోతే? లోకమంతా చీకటిమయమై పోతుంది. ప్రభువును గూర్చి చెప్పేవారెవరు లేక పోవుదురు. గనుక ఈ లోకం అలాగే కొనసాగడానికి ప్రభువు ఇష్టపడరు. ఇంకో మాటలో చెప్పాలంటే క్రైస్తవుల వలన; క్రీస్తు సంఘముల వలన ఈ లోకం కొనసాగుచున్నది. ఈ సంగతిని లోకము గ్రహించుకోలేదు, సంఘ సభ్యులుకూడ కొందరు ఎరుగరు గాని యిది సత్యము. అందరూ ఈ సత్యాన్ని గ్రహించియుంటే, ప్రభువు సంఘము నిమిత్తమై వారెంత కృతజ్ఞత కలిగి యుందురు! అందువలననే "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదా కాలము మహిమ కలుగునుగాక" అని అపొ. పౌలు చెప్పాడం (ఎఫెసీ 3:21).

—o—

## క్రీస్తు యేసునందు దీవెనలు

### ( Blessings in Christ Jesus )

క్రీస్తు యేసునందుండువాడు క్రైస్తవుడు. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను; ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17). "క్రీస్తునందున్న యొక మనుష్యుని నే నెరుగుదును. అతడు పదునాలుగు సంవత్సరముల క్రిందట మూడవ ఆకాశమునకు కొనిపోబడెను" (2 కొరింధి 12:2).

యేసుక్రీస్తు ద్వారా దేవునితో సరియైన సంబంధము కలిగి యుండిన వారికి మాత్రమే ఆత్మీయ ఆశీర్వాదములు వచ్చును. తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దానిద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధాన పరచవలెనని ఈలాగు చేసెను.

గనుక ఆయనయే మనకు సమాధానకారకుడై యున్నాడు(ఎఫెసి 2:16).
క్రీస్తు ప్రభువునందున్న వారు అనుభవించగలిగే కొన్ని దీవెనలు :-

క్రీస్తునందు క్షమించబడుట అనే దీవెన : "పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అ.కా. 2 : 38), "ఆయన వెలుగులో యున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1 : 7). యేసు రక్తము ప్రతి ఒక్కరిని పవిత్రులనుగా చేయును. పవిత్రులుగ నిలువబెట్టును. వెలుగులో నడచుటకు తోడ్పడును.

క్రీస్తు యేసునందు సమాధానమనే దీవెన: క్రీస్తు నందుండక వేరుండువాడు దేవునికి విరోధి. "వ్యభిచారిణులారా, ఈ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4). అనవసర ప్రదేశము లన్నిటి యందును సమాధానము కొరకు ప్రపంచము చూచుచున్నది. అయితే నిజమైన సమాధానము క్రీస్తునందు మాత్రమే గలదు. యేసు ప్రభువు ద్వారానే దేవునితో సమాధానము పొందగలము. కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమా 5:1).

క్రీస్తునందు సిద్ధపాటుయొక్క ఆశీర్వాదము :- ఎవరు సిద్ధపడి యుందురో అట్టివారికి మాత్రమే నిత్యము నిలుచునట్టి ఆనం

ధము కలుగును. "నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను. నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నాకొరకు నీతి కిరీటముంచబడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించువారి కందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4 : 6-8). క్రీస్తు యేసునందుండిన ప్రతి వ్యక్తికి మరణము కొరకైన సిద్ధపాటు ఒక దీవెనకరముగ యుండును.

క్రీస్తు యేసునందుండని వ్యక్తికి మరణముకొరకైన సిద్ధపాటు గాని, లేక నిత్యజీవమును గూర్చిన వాగ్దానముగాని లేక తన శ్రమలను తానే భరించుకొనవలెను. క్రీస్తునందుండునట్లు సువార్త వినవలెను. "వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తునుగూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియబరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనేగాని, నేను యే ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనిన యెడల, ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు" (1 కొరింథి 15:1-2). రక్షణ పొందునట్లు మారుమనస్సు పొందవలెను; అనగా పాపముల విషయమైన పశ్చాత్తాపము (అ.కా. 2:38, 17:30) పొంది పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెద్దుట నేనును వానిని ఒప్పుకొందును (మత్తయి 10:32, రోమా 10:9-10). క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తి

స్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3, గలతి 3:27). క్రీస్తు నందు విశ్వాసము గల ప్రతి వ్యక్తి మరణము కొరకైన సిద్ధపాటును నిత్యజీవము కొరకైన వాగ్దానమును, శ్రమలయందు ఆదరణ, సహాయము, నిరీక్షణ కలిగి యుండును.

ఆత్మీయంగా నీవు యెచ్చట ఉన్నావు? క్రీస్తునందుంటివా? క్రీస్తు యేసునందున్నవారు సంఘమనే ఆయన శరీరములో యున్నారని క్రొత్త నిబంధన బోధించుచున్నది. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు, క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండనియ్యుడి. ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువబడితిరి (కొలస్సీ 1:18, 3:15). —చార్లెస్ బాక్స్.

— o —

కొండమీద ప్రసంగము - 6

# హృదయశుద్ధి గలవారు ధన్యులు

## (Blessed are the Pure in Heart)

(మత్తయి 5 : 8)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములోని ధన్యతలను ఒక్కొక్క దానిని మనం ధ్యానించుచున్నాము. ఈ ప్రసంగములను రేడియోలో విని సత్యవాక్కులో చదివి ఆత్మీయ మేలు పొందుచున్నామని ఉత్తరాలు వ్రాసిన వేలకొలది పాఠకులకు మా ధన్యవాదములు. "హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు" అని మత్తయి 5:8లో యేసుప్రభువు పలికెను. "యెహోవా పర్వతమునకు ఎక్కదగినవాడెవడు? ఆయన పరిశుద్ధ స్థలములో నిలువదగినవాడెవడు? వ్యర్థమైన దానియందు మనస్సు పెట్టకయు, కపటముగా ప్రమాణము చేయకయు, నిర్దోషమైన చేతులును, శుద్ధమైన హృదయమును కలిగి

యుండువాడే. వాడు యెహోవా వలన ఆశీర్వాదమునొందును, తన రక్షకుడైన దేవుని వలన నీతితత్వము నొందును" అని దావీదు వ్రాసాడు (కీర్తన 24:3-5). మరల అతడిట్లనుచున్నాడు: "యెహోవా! నీ గుడారములో అతిథిగా ఉండదగిన వాడెవడు? నీ పరిశుద్ధ పర్వతముమీద నివసింపదగిన వాడెవడు? యథార్థమైన ప్రవర్తన గలిగి, నీతి ననుసరించుచు హృదయపూర్వకముగా నిజము పలుకువాడే" (కీర్తన 15:1, 2).

## కేంద్రస్థానము హృదయం

హృదయశుద్ధిగల వారిని ధన్యులని యేసుప్రభువు చెప్పారు. శుద్ధమైన హృదయము కలిగి యుండువాడే ఆయన పరిశుద్ధ స్థలములో నిలువదగిన వాడని దావీదు చెప్పాడు. మన భావాలకు కేంద్రస్థానము మన హృదయం. "నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయముండును" (మత్తయి 6 : 21). అది మన భక్తిభావాలకు స్థానము. "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను" అనునది ముఖ్యమైన ఆజ్ఞ (మత్తయి 22 : 37). మనము గ్రహించుకొనేది కూడ హృదయముతోనే. కన్నులార చూచి, చెవులార విని హృదయముతో గ్రహించి... అని యుంటాది (మత్త 13:15). అది మానవుల తలంపులకు, మాటలకు, క్రియలకు కూడ కేంద్రస్థానము. నోటి నుండి బయటికి వచ్చునవి హృదయములోనుండి వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్రపరచును. దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు, దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును (మత్త 15 : 18, 19). అయితే ఉపదేశసారమేదనగా పవిత్రహృదయము నుండియు, మంచి మనస్సాక్షి నుండియు నిష్కపటమైన విశ్వాసము

నుండిడియు కలుగు ప్రేమయే (1 తిమోతి 1 : 5). పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితో కూడ నీతిని విశ్వాసమును ప్రేమను సమాధానమును వెంటాడవలెనని తిమోతికి చెప్పబడింది (2 తిమో 2:22). కపట హృదయాన్ని కాదుగాని శుద్ధహృదయాన్ని దేవుడు కోరుచున్నాడు.

నిరపరాధులను చంపు చేతులను, దుర్యోచనలు యోచించు హృదయమును దేవునికి అసహ్యము (సామె 6:16). వారిని నడిపించు నది దుష్ట హృదయం. కయీను తన సహోదరుడైన హేబెలును చంపిన తరువాత తాను నిర్దోషినని దేవుని దగ్గర నటించబోయాడు. నీతిమంతుడైన హేబెలు ఎక్కడున్నాడని ఆయన అడుగగా-నేనెరుగను, నా తమ్మునికి కావలివాడనా? అని అతడనెను. పిల్లలు తప్పు చేసినప్పుడు తమ తప్పును వారు ఒప్పుకొనేలాగున తల్లిదండ్రులు వారికి నేర్పించాలి. కయీను తన తప్పును ఒప్పుకొనుట మాని దాన్ని కప్పిపుచ్చుటకు ప్రయత్నించాడు. మొదటిది నరహత్య, రెండవది అబద్ధం, మోసము రెండు తప్పులు కలిపి ఒక ఒప్పు ఎన్నడు కానేరదు.

నీ మిత్రుడు తీపి కబుర్లు చెప్పుచు నిన్ను మోసగించుచున్నాడని గ్రహిస్తే చాల అసహ్యంగా యుంటాది. అయితే అట్టి ద్రోహం క్రొత్తది యేమీ కాదు. యిట్టి ద్వంద్వస్వభావము యించుమించు మానవజాతి ఆరంభము నుండియే యున్నది. అలనాడు సాతానుడు హవ్వ యొక్క మిత్రునివలె నటించాడు. తన సలహాలను పాటిస్తే హవ్వ తెలివిగలది అవుతాదని నమ్మించింది. దావీదు రాజుకూడ మానవుల ప్రవర్తనను బట్టి విసిగి వేసారిపోయాడు. అతడిట్లు ప్రార్థించాడు: "యెహోవా నన్ను రక్షింపుము, భక్తిగలవారు లేకపోయిరి, విశ్వాసులు నరులలో నుండకుండ గతించిపోయిరి. అందరు ఒకరితో నొకరు అబద్ధము లాడుదురు. మోసకరమైన మనస్సుగలవారై ఇచ్చకములాడు పెదవులతో పలుకుదురు" (కీర్త 12:1-2).

తన పొరుగువానిని క్షేమసమాచారములు అడుగుచున్నట్లుగా నటించి అతని కత్తితో పొడిచి చంపిన ఉదంతము 2 సమూయేలు గ్రంథములో మనము చూడగలము. అమాశే అను వానిని దావీదు శంకించెను. దావీదు తరపుననున్నవారు గిబియోనులో ఉన్న పెద్ద బండ దగ్గరకురాగా అమాశే వారిని కలియవచ్చెను. అప్పుడు యోవాబు నా సహోదరా క్షేమముగా ఉన్నావా అనుచు, అమాశేను ముద్దుపెట్టుకొనునట్లు కనబడి అతని కడుపులో కత్తిని గుచ్చెను; గుచ్చినతోడనే అతని పేగులు నేలకు జారి ఆ దెబ్బతోనే అతడు చనిపోయెను (2 సమూ 20:4-10).

## శుద్ధ హృదయాన్ని తప్పించుకోలేము

మన ప్రభువు బాహ్యశుద్ధికిని అంతరంగిక కల్మషమునకు గల వ్యత్యాసమును తన కాలపు శాస్త్రులకు పరిసయ్యులకు తెలియజేసెను: "మీరు గిన్నెయు, పళ్ళెమును వెలుపట శుద్ధి చేయుదురు గాని అవి లోపల దోపుతోను, అజితేంద్రియత్వముతోను నిండియున్నవి...... మీరు సున్నముకొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చిన యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి. అలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగపడుచున్నారు గాని లోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు" (మత్తయి 23:25-28).

పరిసయ్యులు బాహ్యశుద్ధికొరకు పట్టుదల కలిగియుండేవారు. వారి హృదయం దుర్మార్గతతోను దుష్టత్వముతోను నిండియుండగా పైకి భక్తిగలవారివలె అగపడేవారు. నిజానికి వారు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. మానవుని ఆత్మ పవిత్ర పరచబడనంత వరకు అతడు శుద్ధుడు కాడు. అతని హృదయం అపవిత్రంగాను, అపరిశుభ్రంగాను, పాపముతోను నిండియుండగా అతడు పరిశుద్ధుడని

పిలువబడడు. శుద్ధ హృదయాన్ని మనం కప్పిపుచ్చలేము. దాని వెలుగు ముఖముమీద కనబడును, అది ఒకని వేషభాషలలో కనబడును. ఎక్కడకు వెళ్లినా ఆనందాన్ని సూర్యకిరణాలవలె ప్రసరింపజేస్తాది. అందుకే జ్ఞానియైన సొలొమోను ఇట్లు చెప్పాడు: "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును. కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము" (సామె 4:23).

దేవుడు పై వేషాన్ని కాదుగాని అంతరంగములో యున్న నీ హృదయాన్ని పరిశీలిస్తాడు. ఒకడు పొందే బాప్తిస్మము బాహ్యమైనది. దాన్ని అందరూ చూడగలుగుతారు, చూస్తారు. రక్షింపబడాలంటే బాప్తిస్మము అవుసరం, ఏలయనగా "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడునని" ప్రభువే చెప్పారు (మార్కు 16:16). అయితే బాప్తిస్మమునకు ముందు అతని హృదయ పరివర్తన పరిపూర్ణంగా జరుగాలి. అతడు మారుమనస్సు పొందాలి. హృదయ పూర్వకముగా దేవుని ఉపదేశక్రమమునకు లోబడాలి (రోమా 6:17). బాప్తిస్మము పొందుటకు నిరాకరించువారు అవిధేయులు. వారికి దేవుడక్కర లేదు, నిరీక్షణ లేదు. అయితే శుద్ధ హృదయం లేకుండా క్రైస్తవునివలె, సంఘ సభ్యునివలె నటించువానిని దేవుడు అసహ్యించుకొంటాడు. హృదయశుద్ధి గలవారు ధన్యులు.

## అంతరంగ పరిశుద్ధత అవుసరం

దేవుడు అంతరంగిక పరిశుద్ధతను కోరుచున్నాడు. నిజముగా కపటములేనివాడు ఆయనకు యిష్టుడు (యోహాను 1:47). అతడు నిష్కపటమైన సహోదరప్రేమ కలిగి, హృదయ పూర్వకంగాను మిక్కటముగాను ప్రేమించును (1 పేతురు 1:22). అతడు నిష్కపట మైన విశ్వాసమును కలిగియుండును (2 తిమో 1:5). అతడు సత్యమును గూర్చి, మాన్యమైనవాటిని గూర్చి, ఖ్యాతి గలవాటిని

గూర్చి, పవిత్రమైన వాటినిగూర్చి, రమ్యమైన వాటినిగూర్చి ధ్యానించుము (ఫిలి 4 : 8). "సజ్జనుడు తన హృదయమను మంచి ధననిధిలోనుండి సద్విషయములను బయటికి తెచ్చును. దుర్జనుడు చెడ్డ ధననిధిలోనుండి దుర్విషయములను బయటికి తెచ్చును. హృదయము నిండియుండు దానినిబట్టి నోరు మాట్లాడును" అని అతడెరుగును (లూకా 6:45). హృదయశుద్ధి గలవాడు మాటచేతగాని క్రియ చేతగాని ఎవనిని మోసగించడు. దేవుని చూడాలనే కాంక్ష కలిగిన వాడతడు.

హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరని యేసుప్రభువు చెప్పారు. "ఎవడును ఎప్పుడు దేవుని చూడలేదు" (యోహాను 1:18). నిజమే. దేవుడు ఆత్మ గనుక ఆయన అదృశ్యుడు (యోహాను 4:24; కొలస్స 1:15). మన భౌతిక నేత్రాలతో ఆత్మ స్వరూపిని చూడలేము. అయితే హృదయశుద్ధి గలవారు దేవుని చూచెదరని ఆయన చెప్పారుగదా. ఈ మాటయొక్క పరిపూర్ణ భావాన్ని మనం ఇంకా పూర్తిగ గ్రహించుకోలేము. "ప్రియులారా యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది యింక ప్రత్యక్షపరచబడలేదు. గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము. గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము" (1 యోహాను 3:2). "ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖదర్శనము చేయుచుందురు" (ప్రక 22:3). ఆయన మరల వచ్చు దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడును, విశ్వసించిన వారందరి యందు ప్రశంసింపబడును (2 థెస్స 1:10).

దేవుని చూడాలంటే పవిత్ర హృదయం కావాలి. యేసు ప్రభువునందు విశ్వసించాలి, మారుమనస్సు పొంది పాపక్షమాపణ

నిమిత్తం బాప్తిస్మము పొందాలి. మరణ పర్యంతము నమ్మకముగా జీవించాలి (ప్రకటన 2:10). హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు. ఇది ముమ్మాటికి నిజం! — జాషువా గూటం.

— o —

## సంఘము, ఆత్మీయ ఇశ్రాయేలు

## (The Church, Spiritual Israel)

పాతనిబంధన కాలమంతయు, అంటే పితరుల యుగము, మోషే యుగముల కాలమంతయు మెస్సీయ రాకకు ఉపోద్ఘాతమువలె యున్నది. పితరుల యుగంలో దేవుడు అబ్రాహామును యాకోబును తన సేవకులుగా నుండుటకు పిలిచెను. వారి ద్వారా దేవుడు తనకొరకొక జనాంగమును నెలకొల్పుటకు నిశ్చయించుకొనెను. ఈ జనాంగమును 'ఇశ్రాయేలు' అని పిలుచుటకు ఆయన కిష్టమాయెను. ఆ పేరును ఆయన యాకోబుకిచ్చెను. మోషే యుగంలో దేవుడు తాను ఏర్పరచుకొనిన జనాంగమున కొక ధర్మశాస్త్రము నిచ్చెను. సీనాయి కొండపై దానిని ఆయన మోషేకు బయలుపరచెను. నారాయనను ఆరాధిస్తూ ఆయన కొరకు పరిశుద్ధ జనాంగముగ జీవించాలని వారికి ఉపదేశించెను. అయినను పాతనిబంధన కాలములో దేవుని క్రియలన్నియును కాలము పరిపూర్ణమైనప్పుడు మెస్సీయాను ఈ లోకములోనికి తీసికొని వచ్చుటకు చేయబడిన ఏర్పాటులలో భాగమై యున్నవి. నిజానికి పాతనిబంధన అంతయు ఒక జనాంగముయొక్క కథనమైతే, క్రొత్త నిబంధన అంతయు ఒక వ్యక్తియొక్క వృత్తాంతమై యున్నది.

అందువలననే ప్రభువుయొక్క సంఘమును అపొ. పౌలు "దేవుని ఇశ్రాయేలు" అని పిలువగలిగాడు. ఇందులో ఆశ్చర్యము లేదు. "ఈ పద్ధతిచొప్పున నడుచుకొను వారికందరికి, అనగా దేవుని ఇశ్రాయేలు

నకు సమాధానమును కృపయు కలుగునుగాక" అని అతడు వ్రాసాడు (గలతీ 6:16). అంతేకాదు పాతనిబంధన సంబంధముతో సంఘమును పౌలు అందుకే అలంకారరీతిగా పోల్చి చెప్పాడు. "ఎందుకనగా శరీరమును ఆస్పదము చేసికొనక దేవునియొక్క ఆత్మవలన ఆరాధించుచు, క్రీస్తు యేసునందు అతిశయపడుచున్న మనమే సున్నతి ఆచరించు వారము" (ఫిలిప్పీ 3 : 3). సంఘమును ఆత్మీయ ఇశ్రాయేలు అని పిలుచుట విశిష్టమైనది. ఏలయనగా నాడు ఇశ్రాయేలీయులు దేవునికి ఎట్లు ప్రత్యేకింపబడిరో నేడు క్రీస్తు సంఘము అట్లు ప్రత్యేకింపబడినది.

సంఘము 'క్రొత్తనిబంధన ఇశ్రాయేలు' అని నొక్కి చెప్పు లేఖన భాగము 1 పేతురు 2:9, 10. క్రైస్తవుడై యుండుటలో గల భావమును పేతురు 1 పేతురు 1:22-2:10 వరకున్న లేఖనాల్లో మనకు తెలియజేసాడు. అతడు క్రైస్తవమార్పునుగూర్చి (1:22-25), క్రైస్తవ ప్రవర్తనను గూర్చి (2:2, 3), క్రైస్తవ పిలుపునుగూర్చి (2:4-10) చెప్పాడు. క్రైస్తవులు దేవుని ప్రత్యేక జనాంగము, ఆయన ఏర్పరచుకొనిన నిజమైన ఇశ్రాయేలు గనుక క్రైస్తవుడు ఆనందించాలని అతడు చెప్పాడు. "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9).

## ఏర్పరచబడిన వంశము

క్రైస్తవులు ఆత్మీయ ఇశ్రాయేలు అని వర్ణించుటలో, వారు ఏర్పరచబడిన వంశమని పేతురు చెప్పాడు. వారు ఏర్పరచబడినారు, ఎన్నుకోబడినారు, ప్రత్యేకింపబడినారు. ఈ లోకములో యున్నవారందరిలోనుండి దేవుని వలన ప్రత్యేకముగా పిలువబడినవారు.

సీనాయివద్ద ఇశ్రాయేలీయులకు మోషేద్వారా దేవుడు, "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్టత జనము, నీ దేవుడైన యెహోవా భూమిమీద నున్న సమస్త జనముల కంటె నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచుకొనెను" అని చెప్పెను (ద్వితీ 7 : 6). "కాగా మీరు నామాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్త జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు" (నిర్గమ 19:5).

అయితే మానవ చరిత్రయొక్క అంతిమ యుగంలో శారీరక ఇశ్రాయేలు కాదుగాని, క్రైస్తవులే దేవునియొక్క ఏర్పరచబడిన వంశము. పురాతన ఇశ్రాయేలు నూతన ఇశ్రాయేలుకు నాంది. అది నూతన ఇశ్రాయేలులో నెరవేర్చ బడింది. అట్లు జరుగుటకుగాను దేవుడు ముందుగానే నిర్ణయించెనని పౌలు చెప్పాడు: "ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచితముగా మన కనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కొరకు నిర్ణయించుకొని...జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను" (ఎఫెసీ 1:4-5).

తమకున్న శ్రేష్టమైన తలాంతులు, అందము, జ్ఞానము, ధనాన్ని బట్టి క్రైస్తవులు దేవునికి ఏర్పరచబడిన వంశము కాదుగాని దేవుడు మనలను ప్రేమించినందువలనను, విశ్వాసముద్వారా ఆయన చిత్తమునకు లోబడి ఆయన బిడ్డలమైనందుననే మనం ఆయన సంఘమైతిమి. దేవునితో మనకున్న సంబంధము మనకున్న డబ్బునుబట్టి గాక ఆయన కనికరము వలననే సాధ్యమాయెను. "ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడితిరి" (1 పేతురు 2:10). "మనము నీతి

ననుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరముచొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను" అని పౌలు చెప్పాడు (తీతు 3:5). మనం బాప్తిస్మము పొందినప్పుడు దేవుని కనికరము పొంది ఆయన ఏర్పరచుకొనిన వంశమైతిమి. గనుక దేవునికి స్తోత్రము!

## రాజులైన యాజక సమూహము

క్రీస్తు సంఘము రాజులైన యాజక సమూహమై యున్నది. నేడు క్రైస్తవులందరు దేవునికి యాజకులు. ఒక సమూహముగా వారందరు ఒక యాజక రాజ్యమై యున్నారు. పాత నిబంధన కాలములో లేవీయుల యాజకత్వముద్వారా దేవుడు తన ప్రజలకు మార్గ మేర్పర చెను. అహరోను కుటుంబీకులును లేవి గోత్రికులను ఆయన యాజకు లుగా ఏర్పరచుకొనెను. ప్రజలయొక్క బలులను వారర్పించిరి. మోషే ధర్మ శాస్త్రము చొప్పున వారు ఇశ్రాయేలీయుల ఆరాధన సంతతయును జరిగించిరి. దేవుడు లేవీయులకు, "ఇశ్రాయేలీయుల మధ్యను నీ పాలు నీ స్వాస్థ్యము నేనే" యని చెప్పెను (సంఖ్యా 18:20). లేవీయులకు దేవుని ఆరాధించుటలోను, పరిచర్య చేయుటలోను ప్రత్యేక స్థాన మీయబడెను. దేవుని సమీపించుటకును ఆయనతో సన్నిహిత సంబంధము కలిగియుండుటకును వారికి తరుణమీయబడెను.

ఇప్పుడు లేవీ యాజకత్వము అమలులో లేదుగాని దేవుడొక నూతన యాజక సమూహమును ఏర్పరచుకొనియున్నాడు. క్రీస్తు యొక్క విమోచన సంకల్పము వలన ఆయన తన సంఘమును క్రైస్తవ యుగములో యాజకులుగా ఏర్పరచుకొని యున్నాడు. దేవుడు తన సంఘమును యాజకులనుటయే గాక వారు రాజులైన యాజకులని పిలచుయున్నాడు. సంఘము యాజకుల సామ్రాజ్యము

లేదా రాజులైన యాజకులు. "ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులుగాను జేసెను" (ప్రక 1 : 6). "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారని" అపొ. పేతురు వ్రాసాడు (1 పేతురు 2:5). పరిశుద్ధాత్మని సహాయము వలన, మన మధ్యవర్తియు ప్రధాన యాజకుడునైన క్రీస్తు ద్వారా క్రైస్తవుడు నేరుగా దేవుని సమీపింపవచ్చును. అతడు మానవ యాజకుని ద్వారాగాక, నేరుగా క్రీస్తు ద్వారా దేవుని సమీపింపవచ్చును.

యాజకుడు ఒక వంతెనవంటివాడు. మూల భాషయైన లాటిన్‌లో ఆ పదమునకున్న భావమదియే. పాతనిబంధనలో లేవీ యాజకుడు మానవునికి దేవునికి మధ్య నున్న ఆత్మీయ వంతెనవంటివాడు. దేవుడు యాజకుని ద్వారా ప్రజలను సమీపించేవాడు. ప్రజలు యాజకుని ద్వారా దేవుని సమీపించేవారు. క్రైస్తవ యుగంలో యిదెంత వ్యత్యాసమో! ఒకడు క్రైస్తవుడు కాగానే, ఆ క్షణంలోనే అతడు దేవుని యాజకుడౌతాడు. మనం దేవుని యాజకులమన్న సత్యాన్ని బట్టి ఆయన సహవాసంలో జీవించుటకు శ్రద్ధ కలిగియుండాలి. మనము రాజులైన యాజకులమైనందుకు దేవునికి స్తోత్రము!

## పరిశుద్ధ జనము

క్రీస్తు సంఘము ఒక పరిశుద్ధ జనమై యున్నారు. అలంకార రీతిగా చెప్పాలంటే సంఘము దేవుని జనాంగమై యున్నారు. ఆయన కొరకు ప్రత్యేకింపబడిన ప్రజలై యున్నారు.

దేవుడేర్పరచుకొనిన జనాంగముగా ఇశ్రాయేలీయులు పరిశుద్ధులుగా యుండుటకు పిలువబడిరి. మోషేద్వారా దేవుడు ఇశ్రాయేలీయు

లకు, "మీరు పరిశుద్ధులై యుండవలెను. మీ దేవుడైన యెహోవా నగు నేను పరిశుద్ధుడనై యున్నాను" అని తెలియజేసెను (లేవీ 19:2). "మీరు నాకు యాజకరూపకమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని" ఆయన చెప్పెను (నిర్గమ 19:6). దేవుడిచ్చిన ఈ పిలుపును మనసులో నుంచుకొని పేతురు ఇట్లు వ్రాసాడు: "నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై సమస్త ప్రవర్తయందు పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:14-16).

దేవుని జనాంగమైన క్రైస్తవులు దేవునివలె యుండాలి. ఆయన పరిశుద్ధుడు, మనమును పరిశుద్ధులమునై యుండాలి. మనము ఆయన ప్రియులైన పిల్లలవలె ఆయనను అనుకరిస్తు మన క్రియలలోను వ్యక్తిత్వములోను ఆయనను ప్రతిబింబింపజేయాలి (ఎఫెసీ 5:1, 2). 'పరిశుద్ధత' అను మాటకు ఒక పవిత్రమైన పనికొరకు ప్రత్యేకింపబడుట యని అర్థము. యివి క్రైస్తవులకు వర్తించునప్పుడు దేవుని ప్రజలు ఆయనకు అవిభాజ్యమైన భక్తి, ఆరాధన, పరిచర్య జరుపుటకు ప్రత్యేకింపబడినవారని యర్థము.

క్రైస్తవునికి రెండు జనాంగములలో పౌరసత్వము కలదు. అతడు జీవించు దేశములో మొదటిది, అతడు సమర్పించుకొనిన జనాంగములో రెండవది కలదు. ఈ లోకంలో ఏదో ఒక దేశ పౌరుడుగా అతడు జీవిస్తూయుంటాడు గాని అతని అంతిమ పౌరసత్వము పరలోకంలో యుంటాది. "మన పౌరస్థితి పరలోకము నందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము" (ఫిలిప్పీ 3:20). క్రైస్తవులు దేవుని పరిశుద్ధ జనమై యున్నారని గుర్తించుకొంటే, వారు పవిత్రమైన జీవితమును జీవించుట దుర్లభము కాదు. మనము పరిశుద్ధ జనమై యున్నందుకు దేవునికి స్తోత్రము!

# దేవుని సొత్తయిన ప్రజలు

క్రైస్తవులు దేవుని సొత్తయిన ప్రజలై యున్నారని పేతురు చెప్పాడు. అంటే క్రైస్తవులు దేవుని స్వకీయమైన ఆస్థియై యున్నారని దీని భావం. వారాయనకు చెందినవారు. అందువలననే వారు దేవుని సొత్తు.

మోషేద్వారా దేవుడు ఇశ్రాయేలీయుల కిట్లు చెప్పాడు: "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్టిత జనము. నీ దేవుడైన యెహోవా భూమిమీదనున్న సమస్త జనములకంటె నిన్ను ఎక్కువగా ఎంచి నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచుకొనెను" (ద్వితీ 7 : 6). "మరియు యెహోవా నీతో చెప్పినట్లు నీవే తనకు స్వకీయ జనమైయుండి తన ఆజ్ఞలన్నియు గైకొందువనియు, తాను సృజించిన సమస్త జనములకంటె నీకు కీర్తి ఘనత పేరు కలుగునట్లు నిన్ను హెచ్చించుదునని ఆయన సెలవిచ్చినట్లు నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్టిత జనమై యుందువనియు యెహోవా ఈ దినమున ప్రకటించెను" (ద్వితీ 26:18, 19).

దేవునికి చెందిన ప్రజలు అను చక్కని భావాన్ని పేతురు సంఘమునకు వర్తింపజేస్తాడు. ఈ క్రైస్తవ యుగంలో క్రీస్తు సంఘస్థులు దేవుని సొత్తయిన ప్రజలై యున్నారు. ఇదే భావాన్ని తీతు 2:14లో కూడ పౌలు వ్యక్తపర్చాడు: "ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్క్రియల యందాసక్తిగల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను". క్రైస్తవులు దేవునికి చెందినవారు. వారాయన సొత్తు. ఆయన తన కుమారుని రక్తమునిచ్చి మనలను కొన్నాడు. ఆయన మనలను మార్చాడు. ఇంకా మార్చుచునే యున్నాడు. వీరు నిజముగా నా ప్రజలు అని ఆయన ప్రకటించు

చున్నాడు. మనం దేవుని సొత్తయిన ప్రజలైనందువలన దేవునికి స్తోత్రము!

## ముగింపు

అందువలన క్రీస్తు సంఘము ఆత్మీయ ఇశ్రాయేలు అయ్యున్నది. గతంలో ఇశ్రాయేలీయులవలె నేడు మనం దేవుడు ఏర్పరచుకొన్న ప్రజలం. ఇశ్రాయేలు దేవుని పరిశుద్ధ జనాంగ మెట్లయ్యారో, అట్లే నేడు క్రీస్తు సంఘము దేవుని పరిశుద్ధ జనమై యున్నారు. వారెట్లు యాజకులో అట్లే నేడు మనమును రాజులు, యాజకులు. ఇశ్రాయేలీయులు ఎట్లు దేవుని సొత్తయిన ప్రజలో, నేడు మనమును అట్లే. క్రైస్తవ యుగంలో ఆయన సంఘమే ఆయన సొంత సొత్తు.

నీవు క్రైస్తవుడవు కానిచో, దేవుడనుగ్రహించు అతి శ్రేష్టమైన ఆశీర్వాదములను పోగొట్టుకొనుచున్నావు. దేవుడు తన సంఘాని కిచ్చిన ఆధిక్యతలను గమనించిన తరువాత నీవాయన సంఘములో సభ్యుడవు కాకుండ యుండగలవా?

—ఎడ్డీ క్లోర్ (TFT)

—o—

## శరీర మొక్కటే

### (There is the One Body)

(ఎఫెసీ 4 : 4)

క్రీస్తుకు ఒకేఒక్క శరీరమున్నది. ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1 : 22-23). సర్వసృష్టికి సువార్త ప్రకటింపబడాలని రాజైన క్రీస్తు యొక్క ఆజ్ఞయై యున్నది (మార్కు 16:15). సువార్త ఎక్కడ ప్రకటింపబడెనో, ఎక్కడ ప్రజలు దానికి విధేయులయ్యారో వారే క్రీస్తు సంఘము. అపో.కా. 2:42 లో సంఘము యొక్క పని సంక్షిప్తముగా చెప్పబడినది.

మనము పుచ్చుకొను దానిని బట్టి గాక ఇచ్చుదానిని బట్టి ఆశీర్వదించ బడుదుము (మత్తయి 25:31-46). పుచ్చుకొనువాడుగాక ఇచ్చువాడు ఆశీర్వదించబడును. ఆయన నామము నిమిత్తము ఒక గిన్నెడు చన్నీళ్ళు యిచ్చినవాడు నిశ్చయముగా తన ఫలమును పోగొట్టుకొనడని ప్రభువు బోధించారు (మత్త 10:42). "ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును; అణచి కుదిలించి, దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడునని" ఆయన చెప్పెను (లూకా 6 : 38).

భారత దేశము నుండి ఒక విధవరాలు నాకు ఉత్తరం వ్రాసింది. ఆమెను పరామర్శించుటకు వచ్చే బోధకులకు ఆహారము వడ్డించడానికి ఆమె డబ్బు కోరింది. దేవునియెదుట యిది సరియైన భక్తి కాదు. సంఘము ఆమెను ఇబ్బందులలో పరామర్శించాలి గాని, ఆమె సంఘమును కాదు (యాకోబు 1:27). భారత దేశములో యున్న సంఘము దేవుని వాగ్దానముల నంగీకరించితే ఎంత బాగుండునో ఆలోచించుము. క్రీస్తు శరీరములో పసిబిడ్డలుగా గాక పురుషులుగను స్త్రీలుగను ప్రవర్తించండి. మన జీవముకు భక్తికి కావలసిన హెచ్చరికలన్నీ క్రొత్త నిబంధనలో యున్నవి. తమ మార్గము నేర్పరచుకొనుట మానవుల వశములో లేదు. క్రీస్తు ఇంకా తన సంఘానికి శిరస్సై యున్నాడు. ఆయన సంఘము ఆయన ఆజ్ఞలను శిరసావహించవలసినదే.

జె.సీ. బెయిలీ, కెనడా.

---

సత్యవాక్కు పాఠకులకు విజ్ఞప్తి : మీకు సత్యవాక్కు పత్రిక ఒక కాపీ కంటె ఎక్కువగా అందుచున్నయెడల వెంటనే మాకు తెలియజేయండి. మీ సత్యవాక్కు నెంబరుకూడ తెలియపర్చండి.

## మనము నమ్మునట్లు ఆజ్ఞాపింపబడితిమి

## (We are Commanded to Believe)

పరలోక రాజ్య ప్రవేశము నాశించు ఏ వ్యక్తియైనా దేవుని కుమారుని యందు నమ్మిక యుంచాలి. అది పరిశుద్ధ గ్రంథమందు ఈ విధముగ వ్రాయబడింది: "ఆయన కుమారుడైన యేసుక్రీస్తు నామమందు మనము నమ్మి, మనము ఒకరినొకరము ప్రేమింపవలెననునది ఆయన ఆజ్ఞ" (1 యోహాను 3 : 23). మనము నమ్మునట్లు ఆజ్ఞాపింపబడితిమి. నమ్ముట అనే మాట క్రియా రూపముగ పరిదర్శించవలసినట్టిది. ఒక వ్యక్తి ఒక సాక్ష్యమును వినునప్పుడు అతడు దానిని నమ్మవచ్చు లేక నమ్మకపోవచ్చు. పౌలు ఉదయమునుండి సాయంకాలము వరకు అతడు దేవుని రాజ్యమును గూర్చి పూర్తిగ సాక్ష్యమిచ్చుచు, మోషే ధర్మశాస్త్రములోనుండియు, ప్రవక్తలలోనుండియు సంగతులెత్తి యేసునుగూర్చి వివరముగ బోధించుచు వారిని ఒప్పించుచుండెను. అతడు చెప్పిన సంగతులను కొందరు నమ్మిరి, కొందరు నమ్మకపోయిరి (అ. కా. 28:23-24).

కొందరు నమ్మిరి, కొందరు నమ్మకపోయిరి అను విషయమును గమనించుదము. మన మనస్సుకు ఇష్టమైన దానిని ఎంచుకొనుటలో మనకు పూర్తి స్వాతంత్ర్యము గలదు. మనము నమ్మునట్లు మన మనస్సును స్వాధీనములో యుంచుకొనగలము, లేక దేవుని నమ్ముటకు మనము నిరాకరణ చూపుదుము.

## నమ్మిక విశ్వాసమును పుట్టించును

## (Believing produces Faith)

విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజ స్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది (హెబ్రీ 11:1).

నిజమైన విశ్వాసము బైబిలునందలి యదార్థములు బోధింపబడుచుండగా వినుట వలనగాని చదువుటవలనగాని కలుగును. యోహాను ఈ విధంగా చెప్పుచున్నాడు: "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి ఈ గ్రంథమందు వ్రాయబడియుండ లేదు గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30-31). అపొస్తలుడైన పౌలు యిట్లు చెప్పుచున్నాడు: "వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తునుగూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17). బైబిలు చదువుట వలనగాని లేక ఆ వాక్యము బోధింపబడు చుండగా వినుట వలన గాని మనము దేవుని వాక్యమును నమ్ముట ద్వారా దేవునికి విధేయులమై మనము రక్షింప బడుటకు కావలసిన విశ్వాసము పొందుదుము.

## విశ్వాసము విధేయతను కలిగియుండాలి
## (Faith must Obey)

నీతిమంతుడు విశ్వాసమూలముగ జీవించును. నా యెదుట నీతిమంతుడైన వాడు విశ్వాస మూలముగ జీవించును గాని అతడు వెనుక తీసిన యెడల అతని యందు నా యాత్మకు సంతోషముండదు. అయితే మనము నశించుటకు వెనుకతీయువారము కాముగాని ఆత్మను రక్షించుకొనుటకు విశ్వాసము కలిగిన వారమైయున్నాము (హెబ్రీ 10:38-39). ఆత్మను రక్షించుకొనుటకు విశ్వాసము గల వారెవరు? హెబ్రీ పత్రిక యొక్క గ్రంథకర్త 11వ అధ్యాయములో వారి కాజ్ఞాపింపబడిన వన్నియు నెరవేర్చిన పదహారుమంది పేర్లను ఉదాహరించెను. వారందరు విశ్వసించి దేవుని ఆజ్ఞలకు విధేయులై విశ్వాసముద్వారా తమకు ఆజ్ఞాపింపబడిన వన్నియు నెరవేర్చిరి. కొంతమంది అయితే వారి ఉద్దేశముల పరిహారమే చేయుదురు.

—o—

# క్రైస్తవ జీవితము

## (The Christian Life)

1. క్రైస్తవుడు మేలు ననుభవించుచున్నను శ్రమ ననుభవించుచున్నను క్రీస్తును వెంబడించాలి (ఫిలిప్పీ 4:11-13; 2 కొరింథీ 4:11-13).

2. క్రైస్తవుడు బైబిలునే తన జీవిత మార్గదర్శిగా ఎంచుకోవాలి (2 తిమోతి 3:16, 17).

3. క్రైస్తవుడు బీదలను, అనాథలను ఆదుకోవాలి (కీర్తన 41:1-3).

4. క్రైస్తవుడు సంఘారాధన లన్నిటికి హాజరు కావాలి (హెబ్రీ 10 : 24).

5. ప్రార్థన శక్తివంతమైనదని క్రైస్తవుడు ఎరిగి అనుదినము దేవుని ప్రార్థించాలి (1 యోహాను 5:14, 15).

6. క్రైస్తవుడు మంచి బైబిలు విద్యార్థి అయ్యుండాలి (2 తిమో 2 : 15).

7. క్రైస్తవుడు తాను జీవించు దేశములో మంచి పౌరుడుగా యుండాలి (రోమా 13:1-4).

8. క్రైస్తవుడు దేవునికి మంచి పనివాడుగా. పర్సనల్ వర్కర్ గా యుండాలి (అపొ. కా. 8:4).

9. క్రైస్తవుడు స్థానిక సంఘముయొక్క పనిని ఆర్థికంగా పోషించాలి (1 కొరింథీ 16:1, 2).

10. యేసుప్రభువు ప్రార్థించిన విశ్వాసుల ఐక్యత కొరకు క్రైస్తవుడు కృషి చేయాలి (యోహాను 17:20, 21).

—వాడే మార్టిన్.

— o —

# సంక్షిప్త వార్తలు

జూలై నెల 2వ తేదీ శనివారం కృష్ణా జిల్లా మైలవరంలో సోదరులు టి. ప్రసాదరావ్ గారి కుమారుడు స్టాన్లీ ప్రవీణ్ వివాహము ఘనముగా జరిగెను. వివాహ కార్యమును సోదరులు కె.బి.బి. చంద్రపాల్ గారు జరిపించిరి. సోదరులు జాషువాగారు సతీసమేతముగా ఆ సంతోష కార్యములో పాలు పొందిరి. బంధువులు, మిత్రులు, సంఘ నాయకులు, రాజకీయవేత్తలు పలువురు ఈ వివాహమునకు హాజరై వధూవరుల నాశీర్వదించిరి.

* * * *

1994 జూలై 27వ తేదీ బుధవారం క్రీస్తు సంఘ సువార్తికుల సదస్సు కాకినాడ సత్యవాణి బిల్డింగ్‌లో వైభవోపేతముగా దేవుడు అనుగ్రహించిన చక్కని వాతావరణంలో జరిగెను. పలు ప్రాంతముల నుండి వచ్చిన 250 మందికంటే ఎక్కువ మంది సువార్తికులతో సత్యవాణి భవనములోని బెయిలీ హాలు నిండి కలకలలాడింది. సోదరులు T.Ch. ప్లెమింగ్స్‌గారి ఆధ్వర్యములో నాలుగు కొత్త పాటలు నేర్పించబడగా సోదరులందరు తమ స్వరములనెత్తి పాడుచు దేవుని కొనియాడిరి.

సువార్తికుల సదస్సు సోదరులు ఎలిషే ప్రభాకరరావుగారి ప్రార్థనతో సరిగ్గా సమయానికి ఆరంభమాయెను. అటు తరువాత ముందుగానే ప్రకటించబడినట్లు "సంఘము సర్వతోముఖాభివృద్ధిని సాధించుటలో సువార్తికుని పని యేమి?" అను అంశముపై పలువురు సోదరులు దైవ లేఖనములనుండి చర్చించిరి.

ఈ లోకంలో మానవుడు చేయదగిన పనులన్నిటికంటె సువార్తికుని పని శ్రేష్ఠమైనది. అందుకే సువార్తను ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవని లేఖనములు చెప్పుచున్నవి. సువార్తను ప్రకటించుటకు సిగ్గుపడకూడదు. సువార్తను ప్రకటిస్తు క్రీస్తు పరిచర్యను సంపూర్ణము చేయాలి. సువార్తికుడు సత్యవాక్యమును బోధించుటయే గాక, తప్పుచేసిన వారిని మంచిదారికి తీసికొని రావలెను. సువార్తికుడు దైవ లేఖనములను నిత్యము చదువుచుండవలెను. అతడు మందకు మాదిరిగా యుండాలి. అతడు ప్రేరణ, వాక్ఛక్తి కలిగి మంచి సైనికుని వలె పోరాడాలి. అతని పని వ్యవసాయకుని వంటిది. తన పొలములో

(సంఘములో) కష్టపడి పని చేయుకొలది సంఘము దినదినాభివృద్ధి నొందును. సువార్తికుడు ఆతిథ్య మిచ్చుటలోను, గృహ నిర్వాహకపు పనిలోను ఆసక్తి కలిగియుంటూ స్థానిక సంఘసభ్యు లందరికీ వారివారి బాధ్యతల నప్పగిస్తే సంఘము దినదినాభివృద్ధి నొందును. మరియు ప్రతి స్థానిక సంఘములోను పెద్దలు, పరిచారకులు ఏర్పడేటట్లు సువార్తికుడు ప్రయత్నము చేయాలి. పెద్దలు, పరిచారకులు సంఘములో నెలకొల్పబడేవరకు సంఘము క్రొత్త నిబంధన మాదిరిని బట్టి పరిపూర్ణముగా ఎదుగదని సోదరులు ప్రకటించారు.

సోదరులు పి. ఫిలేమోను, M. బాబీ ఆల్బర్ట్, పి. చంద్రశేఖర్, మోహనరావ్ (కందుకూరు), వి. చిన్నయ్య, M. ఆల్‌ఫ్రెడ్, పాల్ గూటం, నెహెమ్యా గూటంగార్లు పై అంశముపై తమ అమూల్యమైన సందేశము లిచ్చిరి. స్థానిక క్రీస్తు సంఘము మంచి ఆతిథ్యమిచ్చిరి. సోదరులు పి. కృపాలినీగారి ప్రార్థనతో సదస్సు సాయంకాలం 5 గంటలకు ముగిసెను. మధ్యాహ్న భోజన విరామ సమయమందు ఇద్దరు హైందవులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆగష్టు నెల సదస్సు 25వ తేదీన Bro. D. అబ్రహాముగారి ఆధ్వర్యమున నడిపూడి (బండార్లంక) లో జరుగును.

Regd. No. H/KD—45/KD H.O

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To